

మహిళా ఓటర్లే అధికం



- పంచాయతీ ఎన్నికల్లో కీలక భూమిక వారిదే
- జిల్లాలోని 16 మండలాల్లో 3.76 లక్షల ఓటర్లు
- పురుషుల కంటే ఐదు వేలు అధికంగా మహిళలు
- 15 మండలాల్లో స్త్రీలదే ఆధిపత్యం

మంచిర్యాల, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా మహిళా ఓటర్లే కీలక భూమిక పోషించనున్నారు. ఇటీవల అధికారులు ప్రకటించిన గ్రామ పంచాయతీలు, ఓటర్ల జాబితాలో పురుషుల కంటే మహిళలు ఐదు వేల పై చిలుకు అధికంగా ఉన్నారు. జిల్లాలోని 16 మండలాలకుగాను 15 మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. ఒక్క భీమిని మండలం మినహా మిగతా అన్ని మండలాల్లో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. మహిళా ఓటర్ల మద్దతు పొందడానికి వివిధ పార్టీలు తాము బలపరిచే అభ్యర్థులుగా ఎక్కువ మంది మహిళలనే రంగంలోకి దింపుతున్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలతో మహిళలకు పెద్దపీట వేస్తుండగా, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సైతం వారిని ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 306 గ్రామ పంచాయతీలలో వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మొత్తం 306 గ్రామ పంచాయతీల పరిధిలో 2680 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డుకు ఒకటి చొప్పున మొత్తంగా 2680 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల తుది జాబితానే మండల, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం ముసాయిదా కింద తీసుకున్నారు. పంచాయతీ ఎన్నికల్లో తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లా పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఓటర్లు ఉన్నారు.

50 శాతం సీట్లు మహిళలకే...

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రకారం మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తారు. ప్రత్యేకంగా మహిళల రిజర్వేషన్ స్థానాలతోపాటు మిగతా 50 శాతం సీట్లలో జనరల్ కేటగిరికి కేటాయించే స్థానాల్లోనూ సింహభాగం మిగతా 7లో..

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	మొత్తం	పురుషులు	స్త్రీలు	ఇతరులు
బెల్లంపల్లి	23464	11625	11838	01
భీమిని	11529	5844	5684	01
భీమారం	13093	6394	6699	00
చెన్నూర్	26475	13040	13435	00
దండేపల్లి	42101	20486	21614	01
హాజీపూర్	16954	8361	8593	00
జైపూర్	30626	15278	15347	01
జన్నారం	44412	21670	22740	02
కన్నెపల్లి	15490	7614	7875	01
కాసిపేట	26472	13127	13342	03
కోటపల్లి	26990	13320	13668	02
లక్సెట్టిపేట	25227	12261	12966	00
మందమర్రి	11482	5678	5803	01
నెన్నెల	19371	9636	9734	01
తాండూర్	27757	13741	14016	00
వేమనపల్లి	15226	7568	7657	01
మొత్తం	3,76,669	1,85,643	1,91,011	15

ఖోఖోలో బంగారు పతకం

లక్సెట్టిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలకు చెందిన జస్వంత్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ మంగ సోమవారం తెలిపారు. ఈనెల 5 నుంచి 7వరకు హైదరాబాద్ నిర్వహించిన అండర్19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జస్వంత్ ప్రతిభ కనబర్చి ప్రథమస్థానంలో నిలిచాడు. ప్రిన్సిపల్‌తో పాటు ఏటీపీ తిరుమల, పీఈటీ రాజేశ్‌తో అభినందించారు.

కేజీబీవీలో అసిస్టెంట్ కుక్స్ పోస్టుల భర్తీకి ఆహ్వానం

నస్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న రెండు అసిస్టెంట్ కుక్స్ పోస్టుల భర్తీకి మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి పద్మజా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళ అభ్యర్థులు ఈ నెల 9 నుంచి 13వ తేది వరకు నస్పూర్‌లోని మండల విద్యా వనరుల కార్యాలయంలో దరఖాస్తులను చేయాలని సూచించారు. అభ్యర్థులు ఏడవ తరగతి చదివి ఉండాలని, 18-45 సంవత్సరాల వయసు, దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలను కలిపి నస్పూర్‌లో ఇవ్వాలని సూచించారు.

నేటి సాయంత్రం నుంచి వైన్స్ షాపులు బంద్

హాజీపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం పరిధిలోని వైన్స్ షాపులు, బార్లు మంగళవారం సాయంత్రం నుంచి 11వ తేదీ సాయంత్రం వరకు మూసివేయనున్నారు. కాగా ఆయా మండలాల పరిధిలోని బెల్టుషాపుల్లో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సోమవారం నుంచే ముందస్తు ప్రణాళికలతో కాటన్‌ల కొద్దీ మద్యంను నిలువ చేసుకుంటున్నారు.

పెద్దపులుల అలజడి

- జిల్లాలో ఏక కాలంలో ఐదు పులుల సంచారం
- భయాందోళనలో శివారు ప్రాంతాల ప్రజలు
- పులుల రాకపై హర్షం వ్యక్తం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

7

అధికారులకు శిక్షణ

లక్సెట్టిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విధులు నర్వహించే ప్రీసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు ప్రతీ ఒక్కరూ నిస్పక్షపాతంగా విధులు చేపట్టాలని సూచించారు. ఎన్నికలకు ఒక రోజు ముందు అనగా ఈ నెల 10వ తేదీన ఎవరికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వాళ్లు చేరుకోవాలని అంతే కాకుండా 11న ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్ ముగింపు సమయం అని ఆలోపు పోలింగ్ కేంద్రం లోపల ఉన్న ఓటర్లు మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించాలన్నారు. ఎన్నికల విధుల్లో జాప్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల విధుల నిర్వహణపై ట్రైనర్ కందుల తిరుపలి సమక్షంలో ప్రీ షైడింగ్ అధికారులకు పూర్తి శిక్షణ అందజేశారు. ఎంపీడీవో దిలీప్‌కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలను శాంతియుతంగా జరుపుకోవాలి

డీసీపీ ఎగ్గడి భాస్కర్



దండేపల్లిలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

దండేపల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరు ఎన్నికల నియమావళి తప్పసరిగా పాటించి శాంతియుత వాతవరణంలో ఎన్నికలు జరుపుకోవాలని డీసీపీ ఎగ్గడి భాస్కర్ అభ్యర్థుల కు సూచించారు. మండలంలోని కాసిపేట, దండేపల్లిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామాలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నియమావళిపై ప్రజలు, అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అబివృద్ధి చెందేది ఓటు హక్కుతోనే, పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని ప్రజలను ఆయన ప్రోత్సహించారు. శాంతియుత వాతవరణంలో ఎన్నికలు సజావుగా జరుపుకునేందుకు అందరు కృషి చేయాలన్నారు. డీసీపీ వెంట లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తాహసీనోద్దీన్ ఉన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

డీఎల్పీవో ధర్మరాణి



దండేపల్లిలో పీవోల శిక్షణను పరిశీలిస్తున్న డీఎల్పీవో ధర్మరాణి

దండేపల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11 నిర్వహించే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది గ్రామ పంచాయతీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని మంచిర్యాల డీఎల్పీవో ధర్మరాణి సూచించారు. సోమవారం దండేపల్లిలో మండల పరిషత్ కార్యలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికలో విధులు నిర్వహించే పీవోలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ తీరును ఆమె పరిశీలించారు.. ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయక పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు కీలకమని, ఎన్నికల అధికారులు తగు జాగ్రత్తలు పాటించి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం సిద్ధమైన ఎన్నికల సామగ్రిని, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే తీరును ఆమె పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో విజయప్రసాద్ ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వేసేశారు..



పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు

లక్సెట్టిపేట, డిసెంబరు, 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, అధికారులు ముందుగానే వారి ఓటు వేసి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సులో ఉద్యోగులు వాళ్లకు కేటాయించిన పోస్టల్ బ్యాలెట్‌ను వేశారు. పీవోలు, ఏపీవో, పీపీవోలు, ఇతర ఉద్యోగులు అంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తున్నట్లు ఎంపీడీవో సరోజ తెలిపారు.

బాసర ఓరియంటేషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పెయింటింగ్ వేస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

కోటపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాసరలోని ట్రిపుల్‌ఐటీలో ఈ నెల 2 నుంచి 5 వరకు నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. స్పిక్‌మేకే (యువతలో భారతీయ శాస్త్రీయ సంగీతం, సంస్కృతిని ప్రోత్సహించే సంస్థ) నాలుగవ తెలంగాణ రాష్ట్ర సమ్మేళనం బాసరలో నిర్వహించగా ఈ సదస్సుకు ఎంపికైన కోటపల్లి పీఎంశ్రీ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినీలో ఓరియంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. గైడ్ టీచర్ సలీంఖాన్, గీతారాణిల నేతృత్వంలో పది మంది ఈ కార్యక్రమానికి హాజరై యోగా, హిందుస్తాని, గాత్ర సంగీతంతో పాటు మధుబని పెయింటింగ్, చెర్యాల మాస్క్ తయారీపై శిక్షణ పొందారు. శిక్షణ పొందిన విద్యార్థినులు మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిభ కనబర్చిన వారిని ప్రిన్సిపల్ రాజశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మండలానికి చేరుకున్న ఎన్నికల సామగ్రి



ఎంపీడీవో కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులు

లక్సెట్టిపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరుగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామగ్రి సోమవారం మండలానికి చేరుకుంది. స్థానిక ఎంపీ డీవో కార్యాలయానికి బ్యాలెట్ బాక్స్‌లతో పాటు గోనె సంచులు ఇతర సామగ్రి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 10న పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లక్సెట్టిపేట మండలంలోని 18గ్రామాల్లో మొత్తం 160పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హాజీపూర్ : హాజీపూర్ మండలానికి సోమవారం ఎన్నికల సామగ్రి చేరింది. మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 39 మంది సర్పంచు అభ్యర్థులు బరిలో ఉన్నారు. 106 వార్డుల్లో 23 వార్డులు ఏకగ్రీవం కాగా, 84 వార్డుల్లో పోటీలో 197 మంది బరిలో ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సామగ్రి మండలానికి చేరింది. బ్యాలెట్ బాక్సులు అధికారులు ఎంపీడీవో కార్యాయలంలో భద్రపరిచారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

మంచిర్యాల డీసీపీ బాస్కర్



జెండవెంకటాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

లక్సెట్టిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఓటు హక్కు ను స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి భాస్కర్ అన్నారు. సోమవారం సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో లక్సెట్టిపేట మండలంలోని జెండవెంకటాపూర్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు ఎన్నికలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటు అనేది మనకు రాజ్యాంగం కల్పించిన ప్రథమ హక్కు అన్నారు. ప్రతీ ఓటరు తమకు నచ్చిన వ్యక్తి కి ఓటు వేయాలని ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర బహుమతులకు తానివ్వకుండా ఏలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటును తమకు పని చేసే, తమ గ్రామాన్ని అభివృద్ధి చేసే అభ్యర్థికి నిర్భయంగా ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. ఎవరైన బెదిరింపులకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు పోలీసులు అనుక్షణం మీకు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామంలో పాత నేరస్తులు, రౌడీ షీటర్లు ఉంటే వాళ్లను కస్టడీలోకి తీసుకుని ఏలాంటి ఘటనలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ ఉన్నారు.

ఘనంగా సంకట హర చతుర్థి

స్వామి వారికి కోటి పూలతో అభిషేకం..



గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గణపతి హోమం, ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో ఆలయాన్ని అలంకరించారు. గణపతి స్వామికి 1008 కిలోల 21 రకాల పూలతో పుష్పాభిషేకం కన్నుల పండుగగా జరిగింది. తెల్ల చామంతి, పసుపు చామంతి, ఎర్ర గులాబీ, పసుపు గులాబీ, మల్లె, జాజి, కనకాంబరం, నందివర్ధనం, గరుడ వర్ధనం, లిల్లీ, నూరు వరహాలు, కలువలు, తామరలు, నాగమల్లి, ఆర్కిడ్, తుమ్మి, గన్నేరు, జర్బెరా, బిల్వం, దవనం తదితర రకాల పూలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం చుట్టూ ప్రక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామి వారికి వివిధ రకాల 10 క్వింటాళ్ల పూలతో పుష్పాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పుర వీధుల గుండా స్వామి పల్లకి సేవ నిర్వహించారు. చంద్రోదయం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వినియోగదారుల పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

మంచిర్యాల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎరుకల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 బుధవారం మంచిర్యాల ఏసీసీ టౌన్ 2 అసిస్టెంట్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు పరిష్కార వేదిక నిర్వహించబడు తుందని, విద్యుత్ సంబంధిత సమస్యలు ప్రత్యక్షంగా స్వీకరించిన వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. మంచిర్యాల సబ్ డివిజన్ పరిధిలోని రాంనగర్, రాజీవ్ నగర్, ఏసీసీ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులు పాల్గొంటారని, సమస్యలను ప్రత్యక్షంగా వివరించి పరిష్కారానికి వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు

హాజీపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అబివృద్ధి చెందుతున్నాయని మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం రాపల్లి, హాజీపూర్, కర్ణమామిడి, బుద్దిపల్లి, పెద్దంపేట గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఆమెకు ఆయా గ్రామాల్లో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథ్

లక్సెట్టిపేట, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే ప్రతీ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. సోమవారం లక్సెట్టిపేట మండలం మిట్టపెల్లి, సూరారం, లక్ష్మీపూర్, జెండవెంకటాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీ బలపర్చిన అభ్యర్థిని సర్పంచ్‌గా ఓటు వేసి గెలింపించాలని కోరారు. ముఖ్యంగా యువత, మహిళలతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. గ్రామాలకు వచ్చే నిధులు పెద్దమొత్తంలో కేంద్రం ఇస్తోందని బీజేపీ బలపర్చిన అభ్యర్థిని గెలిపిస్తే ఎక్కువ నిధులు గ్రామానికి వస్తాయన్న విషయం ప్రతీ ఒక్కరూ గమనించి బలపరిచే అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న యాజమాన్యం



మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

మందమర్రిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు విద్యాబోధనతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన నాసా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత కొన్ని రోజులుగా పాఠశాల యాజమాన్యం భూమి నుంచి గగనతలం వరకు ఉన్న పలు అంశాలపై విపులీకరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నాసా కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థుల విజ్ఞానం పెరుగుతుంద న్నారు. అనంతరం నాసా కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం అరవిందరెడ్డి, అకాడమీ కో ఆర్డినేటర్ నాగ రాజు, ప్రధానోపాధ్యాయుడు రమేష్, డీన్ రవికుమార్, సునీత, నాసా ఇన్‌చార్జీ అతిథి పాల్గొన్నారు.

అప్పులు తీర్చే మార్గంలేక ఒకరి ఆత్మహత్య


శంకర్(ఫైల్)

భీమారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజీపల్లి గ్రామానికిచెందిన గ్రామపంచాయతీ వర్కర్ జాగటి శంకర్ (43) అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం శంకర్ కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈ నెల 7న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

హాజీపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట్ గ్రామం పరిధిలోని 63వ నంబరు జాతీయ రహదారిపై ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు ఐరన్ పైపుల లోడ్‌తో వెళ్తున్న లారీ సోమవారం తెల్లవారుజామున డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీని సరి చేసి ఐరన్‌ను ఎవరు తీసుకువెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి


సందీప్ (ఫైల్)

మంచిర్యాల క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి సందీప్ (27) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా ఆయన తోడల్లుడు సుమన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి సందీప్‌కు నాలుగేళ్ల క్రితం కావ్యతో వివాహం అయింది. శ్రీరాంపూర్‌లో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి సందీప్ ఓదెలకు చెందిన తోడల్లుడు సుమన్‌తో కలిసి శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాలకు ద్విచక్ర వాహనంతో వస్తుండగా అతి వేగంతో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో సందీప్ అక్కడిక్కడే మృతి చెందగా సుమన్ ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

భీమిని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపేట గ్రామశివారులో వాగు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు భీమిని ఎస్సై విజయ్ కుమార్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ అనే వ్యక్తి వాగు వద్ద గుడుంబా అక్రమంగా నిల్వఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడ సోదాలు నిర్వహించి పట్టుకున్నామన్నారు.. దాని విలు రూ.2000 రూపాయలు ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుంన్నట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

కౌటాల(చింతలమానేపల్లి), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం డబ్బా బారెగూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి రషీద్ తన కార్యకర్తలతో ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన టాక్రె వరప్రసాద్, టాక్రె నవీన్‌లు అడ్డుకోవడంతో గొడవకు దారి తీసింది. అబ్దుల్ రషీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరప్రసాద్, నవీన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఘనంగా ధమ్మ దీక్షా దివస్

వాంకిడి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో సోమవారం ధమ్మ దీక్షా దివస్‌ను అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడు తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జైరామ్, విజయ్, రోషన, రాజేశ్వర్, పాండుజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ కుమారస్వామి, ఎస్సై సందీప్

కాగజ్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అంతకుముందు పోటీలను కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, రూరల్ ఎస్సై సందీప్‌కుమార్ ప్రారంభించారు. విక్రమ్ తేజ, సుమిత తివారి, అంకిత్, ప్రభాత్ మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. త్వరలో వరంగల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు మధు, శేఖర్, పీడీలు ఇంద్ర, సంభాషరావు, సాయి, శివ, వంషీ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతితో కోటపల్లిలో విషాదం

- పెద్దపల్లి జిల్లా ధర్మారంలో సాంబార్ గిన్నెలో పడి మృతి



మోక్షిత్ (ఫైల్)

కోటపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి మండల కేంద్రానికి చెందిన మొగిలి మధుకర్-శారద దంపతుల కుమారుడు మోక్షిత్ (4) అనే బాలుడు సాంబార్ వంట పాత్రలో పడి మృతి చెందడంతో కోటపల్లిలో విషాదం నెలకొంది. పెద్దపల్లి మండలం మల్లాపూర్ బాలికల గురుకుల విద్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో మధుకర్ వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అతడి భార్య శారద, కూతురు శ్రీమహి, కుమారుడు మోక్షిత్‌తోకలిసి పాఠశాలలోని క్వార్టర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం వంట గదిలో మధుకర్ సాంబార్ వండి పక్కన పెట్టాడు. ఈ క్రమంలో అతడి కుమారుడు మోక్షిత్ ఆడుకుంటూ వెళ్లి వంట గదిలోకి వచ్చి అకస్మాత్తుగా వేడిగా ఉన్న సాంబర్ వంట పాత్రలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని మొదట కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం బాలుడు మృతిచెందాడు.

సోమవారమే మోక్షిత్ పుట్టిన రోజు కాగా పుట్టిన రోజునే మరణించడం ఆ కుటుంబంలో తీవ్రవిషాదాన్ని నింపింది. పుట్టినరోజు వేడుక జరగాల్సి ఉండగా కళ్లముందే తమ కుమారుడు మృతిచెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునగగా మధుకర్ తల్లి, సోదరులు, బంధుమిత్రులందరు ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రి నుంచి స్వగ్రామమైన కోటపల్లికి బాలుని మృతదేహాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు.

ఓటర్లకు గాలం

- గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఆఫర్లు
- గంపగుత్త ఓట్లపై ఫోకస్
- కుల సంఘాలకు తాయిలాల ఎర
- వంట, టెంట్ సామగ్రి అందజేత
- వలస ఓటర్లతో సంప్రదింపులు



బెజ్జూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉండగా 1,188 వార్డు సభ్యులు ఉన్నారు. మొదటి విడత ఎన్నికలు 11న, రెండో విడత 14న, మూడవ విడత 17న జరగనున్నాయి. బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేయడమే కాకుండా గెలుపే లక్ష్యంగా ఓటర్లను తమవైపు తిప్పు కునేలా హామీలతో పాటు పలు ఆఫర్లు ఇస్తున్నారు. గంపగుత్త ఓట్లను రాబట్టేందుకు కుల సంఘాలకు భారీగా తాయిలాల గాలం వేస్తున్నారు. ఇందులో భాగంగా కుల సంఘాలను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. వలస ఓట్లపైన ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర ప్రాంతాల్లో ఓటర్లను పోలింగ్ రోజున రప్పించుకునేలా సంప్రదింపులు మొదలు పెట్టారు.

భిన్నంగా ప్రచార పర్వం...

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం భిన్నంగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో పార్టీలకంటే వ్యక్తులకే ప్రాధాన్యం ఉండటం వల్ల మెజారిటీ అభ్యర్థులు తమ వ్యక్తిగత ప్రచారంతోనే ముందుకు సాగుతున్నారు.

కొందరు మందీ మార్బలంతో హడావుడి చేస్తుండగా, చాలామంది ఒక్కరుగా రాత్రి, తెల్లవారు జామున ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి తమకు ఓటు వేయాలని మాట తీసుకుంటున్నారు. మరికొందరు సోషల్ మీడియా ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. వాట్సప్‌లో సందేశాలు, టెక్స్ట్ మెసేజ్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారాలను హోరెత్తిస్తున్నారు. కొందరు అభ్యర్థులు పాటల రూపంలో తమ ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

సోషల్ మీడియాలో జోరుగా చర్చలు...:

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా పల్లెల్లో సోషల్ మీడియాలో అభ్యర్థుల ఎన్నికపై జోరుగా చర్చ సాగుతోంది. సర్పంచ్ ఎన్నికల్లో ఎవరిని ఎన్నుకుంటే బాగుంటుంది అనే అంశం పై గ్రామాల్లోని వాట్సప్ గ్రూపుల్లో చర్చను లేవదీస్తు న్నారు. ఈ చర్చల్లో యువత పాల్గొంటున్నారు కానీ చర్చలు వ్యక్తిగత ఆరోపణలకు, విమర్శలకు దారి తీస్తోంది. కొన్నిచోట్ల ఆందోళన సైతం చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల వేళ చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంటుంది. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది.

వలస ఓటర్లకు ఫోన్లు...

గ్రామాల నుంచి నగరాలు, పట్టణాలకు వలస వెళ్లిన వారిలో అనేక మంది ఓటర్లు ఉన్నారు. గ్రామాల్లో ఓటు ఉండి ఉపాధి, ఉద్యోగం, విద్యారీత్యా హైదరాబాద్‌తో పాటు పొరుగు జిల్లాలకు వెళ్లినవారు ఉన్నారు, ఆ ఓటర్లకు అభ్యర్థులు ఫోన్లు చేసి బరిలో ఉన్నామంటూ చెబుతూ మద్దతు కోరుతున్నారు. పోలింగ్ రోజు ఓటేసేందుకు గ్రామానికి రావాలని ముందుగానే ఫోన్ ద్వారా ఓ మాట చెప్పి ఉంచుతున్నారు. ఎన్నికల రోజున మరవకుండా వచ్చి తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. ఇందుకు అవసరమైన ఖర్చులు కూడా తామే భరిస్తామంటూ చెబుతున్నారు.



ఆలయాలకు విరాళాలు..

పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా నిరూపించుకోవడానికి సిద్ధమైన అభ్యర్థులు ఎలాగైనా గెలవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే గెలుపు కోసం అనువైన మార్గాలపై దృష్టి పెట్టారు. గ్రామాల్లో గెలుపోటములు ప్రభావితం చేసేది కుల సంఘాలే. దీంతో కుల సంఘాలకు చెందిన పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. కొందరైతే భారీగా నజరానాలను అందజేస్తున్నారు. ప్రధానంగా కుల సంఘాలకు చెందిన ఆలయాలకు పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు. అంతే కాకుండా వంట, టెంట్ సామగ్రిని సైతం ఆఫర్ చేస్తున్నారు. ఇవే కాకుండా కుల సంఘాల్లోని సభ్యుల లెక్క మేరకు ఒక్కొక్కరికి కొంతమేర నగదును ముట్టచెబుతున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ఈ వ్యవహారం వేగంగా సాగుతోంది.

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

వాంకిడి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఆయూష్ ఆధ్వర్యంలో యోగా శిక్షకుడు దోడ్డజీ యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక మానసిక ఆరోగ్యానికి యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మీనా, పీడీ దీపిక, సిబ్బంది ఉన్నారు.

శిక్షణ బీట్ ఆఫీసర్ల పర్యటన

సిర్పూర్(టి), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫారెస్టు అకాడమీ 38వ బ్యాచ్ శిక్షణ బీట్ ఆఫీసర్లు క్షేత్ర పర్యటనలో భాగంగా సిర్పూర్(టి) రేంజ్‌లోని ఇటుకల పహాడలో సోమవారం పర్యటించారు. ప్లాంటేషనను విజయవంతం చేయడానికి చర్యలను, టైగర్ ట్రాకింగ్ చేస్తున్న విధానాన్ని ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో ప్రవీణ్‌కుమార్ వివరించారు. అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శివప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు, బీట్ ఆఫీసర్లు నరేష్, అరుణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్ ఫెయిర్


ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ హరితదళం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, సైన్స్ అండ్ అకౌంట్ అధికారి దేవాజీ, సైన్స్ అధికారి మధుకర్, సుశీల, ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహా, లెక్చరర్ దేవేందర్, జనార్దన్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ జగన్నాడే మహారాజ్ జయంతి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణం లోని దస్నాపూర్‌లో సంత్ జగన్నాడే మహారాజ్ జయంతి వేడుకలను సోమవారం అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, బీసీ జేఏసీ నాయకుడు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన అహ్మద్, సంఘం నాయకులు సందీప్, శ్రీనివాస్, ఆకాష్, సంతోష్, బిజ్జు పాల్గొన్నారు.

వాంకిడి: సంత్ జగన్నాడే మహారాజ్ జయంతిని వాంకిడి మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తేలిగాండ్ల కులస్తులు మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో తేలిగాండ్ల సంఘం నాయకులు తుకారాం, శంకర్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.


జగన్నాడే మహారాజ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ప్లాస్టిక్ నిషేధం.. ఆచరణలో విఫలం



గోలేటిలోని సీఈఆర్ క్లబ్

రెబ్బెన, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం ఎంతగా కట్టడి చేయాలనుకున్నా అంతకంతకూ రెట్టింపవుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మాంసం, కూరగాయల దుకాణాలు, పాలు, పెరుగు విక్రయ కేంద్రాలు, కిరాణం, జనరల్ స్టోర్లు, మిఠాయిలు, బేకరీలు, హోటళ్ల ఇలా ప్రతీ చోట ప్లాస్టిక్ కవర్ల వినియోగం విస్తృతంగా ఉంది. మార్కెట్‌లో 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్నవాటి విక్రయాలు జరుగుతున్నాయి. ఫలితంగా నిత్యం పోగవుతున్న చెత్తలో, మురుగునీటి కాలువల్లో కవర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు కల్వర్టుల వద్ద, డంపింగ్ యార్డులు, ఇలా ప్రతీ చోట ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, పేపర్లు గుట్టలుగా పేరుకు పోతున్నాయి. గతంలో పురపాలక సంఘాల పరిధిలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఆదేశాలు ఉన్నాయి. ఆ సమయంలో పెద్దగా అమలు కాలేదు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని ప్రభుత్వపరంగా అవగాహన కార్యక్రమాలు కల్పించినా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

సింగరేణిలో మాత్రం..

ఇటీవల కాలంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం మరింత పెరిగింది. అయితే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమేమి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో మాత్రం పేపరు ప్లేట్‌లు, గ్లాసులు మాత్రమే వినియోగిస్తుంటారు. అంతే కాకుండా సింగరేణికి సంబంధించిన సీఈఆర్ క్లబ్, కమ్యూనిటీ హాల్, కార్యాలయాల్లో జరిగే కార్యక్రమాలకు పేపర్ గ్లాసులు, ప్లేట్లు వాడుతుంటారు. అదే సింగరేణి కాకుండా మిగితా ప్రాంతాల్లో ఇది పెద్దగా అమలు కావడం లేదు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం ఉండడంతో రోజురోజుకు ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లను నియంత్రించేందుకు నిత్యం దుకాణాల వద్ద తనిఖీలు జరుపుతూ ముందుగా హెచ్చరికలు, తరువాత జరిమానాలు విధించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ కవర్లలో సరుకులు తీసుకెళ్లే వారికి సైతం అవగాహన కల్పిస్తే మరింత ఫలితాలుంటాయి. అంతే కాకుండా ప్రజలు కూడా స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కృషిచేయాలి. ఎక్కువగా మార్కెట్ వంటి ప్రాంతాల్లో వినియోగం ఎక్కువ కాబట్టి అటు వెళ్లే క్రమంలో సంచులు తీసుకెళ్లాలి. ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

బహుమతులు సాధించేలా కృషి చేయాలి


రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రక్షణ పక్షోత్సవాల్లో ఆర్కే 7 గని బహుమతులు సాధించేలా కృషి చేయాలని గని మేనేజర్ తిరుపతి అన్నారు. రక్షణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రక్షణ విభాగంలో ఆర్కే 7 గనికి అనేక పతకాలు వచ్చాయని, ఈ ఏడాది సైతం సాధించేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, రక్షణాధికారి సంతోష్‌రావు, పిట్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, పిట్ కార్యదర్శి సారయ్య, అండర్ మేనేజర్లు రవీందర్, రామ్, బాలకృష్ణ, సంక్షేమాధికారి శంతన్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలి


ఉద్యోగికి బహుమతి అందిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో వార్షిక రక్షణ పక్షోత్సవాలను సోమవారం తనిఖీ కమిటీ కన్వీనర్, బెల్లంపల్లి ఏరియా ఇంజనీర్ జి కృష్ణమూర్తితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతి ఏడాది రక్షణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తమ పని ప్రదేశాల్లో అప్రమత్తతతో ఉంటూ వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరించాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించే క్రమంలో రక్షణను ఎవరూ మరవకూడదని పేర్కొన్నారు. ప్రతి రోజు రక్షణతో పనిచేయాలని, సంస్థ పురోగతికి కృషి చేయాలని సూచించారు. గతంలో జరిగిన ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం తనిఖీ కమిటీ కన్వీనర్ కృష్ణమూర్తి సీహెచ్‌పీలో ఉద్యోగులు పాటిస్తున్న రక్షణ చర్యలను పరిశీలించారు. రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ ట్రేడ్ టెస్టులలో విజేతలుగా నిలిచిన, కేటాయించిన పనిని సకాలంలో పూర్తి చేసిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మొక్కలు నాటారు. కమ్యూనికేషన్ సెల్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఏరియా ఇంజనీర్ రమ ణారావు, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, సీహెచ్‌పీ స్టాటిటరీ మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్రలింగం పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ అన్నారు. సోమవారం శాంతిఖని గనిలో 56వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తి చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. రక్షణ కోసం సింగరేణి సంస్థ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ప్రసాద్, సేఫ్టీ కమిటీ కన్వీనర్ సైదులు, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేయబోతున్న టైలరింగ్, మగ్గం వర్కు, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు దరఖాస్తులు చేసుకునే వారిలో సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు భార్యలు, వారి పిల్లలు, భూనిర్వాసితులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఓసీపీ పరిసర గ్రామాల మహిళలు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 9వ తేదీ 15 వరకు జీఎం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 7013359316, 8688150431 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాలో..

పర్యావరణ పరిరక్షణ ప్రశంసనీయం


అటవీ సలహాదారుకు వివరాలు వెల్లడిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో పర్యావరణ పరిరక్షణకు ఎంతో పాటు పడుతున్నారని, ఇది ఎంతో ప్రశంసనీయమని రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి, సింగరేణి సంస్థ అటవీ సలహాదారు ఎంసీ పరిగెన్ కొనియాడారు. శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల కు సంబంధించిన మైనింగ్ లీజు, ప్లాంటేషన్‌లను సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం పర్యావరణ అనుమతుల గురించి సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంసీ పరిగెన్ మాట్లాడుతూ, నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ పద్ధతులు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో బాగున్నాయన్నారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో మొక్కలను పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, ఎస్టేట్స్ అధికా రులు వి మహేష్, ఎస్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి

మందమర్రిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ పనులు పూర్తయ్యాయి. తొమ్మిది లక్షల రూపాయలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను చేపట్టారు. ఈమేరకు సోమవారం ట్రాక్‌కు తుది మెరుగులు దిద్దారు. బౌండరీలకు రంగులు వేశారు. వాకింగ్ చేసేటప్పుడు వాకర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పశువులు, వాహనాలు లోపలికి రాకుండా గేటును కూడా అమర్చారు. ట్రాక్ పనులు కొత్త నడకన నడిచినప్పటికీ వాకింగ్ ట్రాక్ పూర్తి కావడంతో వాకర్లు హర్షం వ్యక్తం చేశారు. లైట్లను కూడా అమర్చడంతో పాటు వాకింగ్ చేసిన తర్వాత కూర్చోవడానికి కుర్చీలు కూడా ఏర్పాటు చేశారు. మందమర్రి జీఎం రాధాకృష్ణ వాకింగ్ ట్రాక్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు పూర్తయ్యాయి.

ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయాలని పేర్కొన్నారు. సింగరేణి పాఠశాల మైదానంలో జిమ్, యోగా సెంటర్‌లను గతంలోనే ఏర్పాటు చేశామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.


వాకింగ్ ట్రాక్‌కు రంగులు వేస్తున్న సిబ్బంది, అమర్చిన గేటు

అంధకారంలో మెడికో విద్యార్థులు

హాజీపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపేట్‌లో నూతనంగా నిర్మితమైన మెడికల్ కాలేజీలో ఆదివారం రాత్రి విద్యార్థులు అంధకారంలో గడిపారు. విద్యుత్ సమస్య తలెత్తడంతో రాత్రి 11 గంటల సమయంలో బాయ్స్, గర్ల్స్ హాస్టల్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు చీకట్లో భయం భయంగా గడిపారు. ముఖ్యంగా గర్ల్స్ హాస్టల్‌లోని విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తేరుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం ఉదయం విద్యుత్‌ను పునరుద్ధరణ చేశారు.

గురుకులాల పేరెంట్స్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నరేష్



మందమర్రిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీ పీఏ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మందమర్రి పట్టణానికి చెందిన ఉప్పులేటి నరేష్ నియమితులయ్యారు. ఆయనను నియమి స్తూ గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల విద్యా భివృద్ధితో పాటు పేరెంట్స్ పటిష్టతకు కృషి చేస్తున్నందుకు ఈ పదవిని ఇచ్చారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

భీమిని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరారు. బెల్లంపల్లి మాజీ మార్కెట్ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా ఆధ్వర్యంలో సోమవారం బిట్టూరుపల్లి మాజీ సర్పంచు గడ్డం ఎల్లాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మహేశ్వర్ గౌడ్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేసేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దపులుల అలజడి



- జిల్లాలో ఏక కాలంలో ఐదు పులుల సంచారం
- భయాందోళనలో శివారు ప్రాంతాల ప్రజలు
- పులుల రాకపై హర్షం వ్యక్తం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

కాసిపేట/జన్నారం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా అడవులు పులులకు ఆవాసంగా మారుతున్నాయి. 20 ఏళ్ల క్రితం ఒక పెద్దపులి అడవిలోకి వచ్చిందంటే దాని గురించి గొప్పగా చెప్పుకునే వారు. కానీ వారం రోజుల నుంచి మహారాష్ట్రలోని తిప్టేశ్వర్ తాడోబా పులుల అభయారణ్యం నుంచి మంచిర్యాల జిల్లాకు పులుల వలసలు పెరిగిపోయాయి. డిసెంబరులో ఏకకాలంలోనే ఐదు పులులు జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూరు, అటవీ డివిజన్‌లతో పాటు జన్నారం, కవ్వాల అభయారణ్యంలో పెద్దపులులు సంచరించడం పట్ల అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఆనందంతో పాటు కొంత ఆందోళనకు సైతం గురవుతున్నారు. పులులు స్థిరనివాసంగా ఉండేందుకు విస్తారంగా చర్యలు చేపడుతూనే వాటి భద్రత రక్షణకు అధికారులు రాత్రి పగలు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

పులులకు ఆవాసంగా జిల్లా అడవులు

జిల్లా అడవులు పులులకు ఆవాసంగా మారాయి. 1,76,669.21 హెక్టార్లలో దట్టమైన అడవులతో విస్తరించిన ఈ అడవులు ఇప్పుడు పులులకు పెట్టని కోటలా మారుతున్నాయి. 50 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న మంచిర్యాల అటవీ డివిజన్‌లో ఎల్ 1 పెద్దపులి గత ఏడాదిన్నర కాలంగా లక్షెట్టిపేట రేంజ్ పరిధిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంది. అలాగే 45 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న చెన్నూరు అటవీ డివిజన్‌లో వారం రోజులుగా రెండు పులులు మహారాష్ట్రలోని తాడోబా నుంచి వచ్చి చేరాయి. ఇదిలా ఉండగా 43 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్న బెల్లంపల్లి అటవీ డివిజన్‌లో 6 నెలల నుంచి మరో ఆడపులి హల్‌చల్ చేస్తుంది. పులులకు ఆవాసంగా ఏర్పాటు చేసిన జన్నారం కవ్వాల్ అభయా రణ్యంలోకి ఇటీవల ఒక మగపులి వచ్చి చేరింది. దీంతో ఐదు పులులు మంచిర్యాల అడవులకు కొత్త అందాన్ని తీసుకువచ్చాయి.

భయాందోళనలో ప్రజలు

జిల్లాకు పులుల తాకిడి పెరగడంతో అటవీ శివారు ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలతో రైతులను పత్తి పంట నట్టేట ముంచింది. ఇప్పుడు పత్తి చేతికి వచ్చే సమయంలో పెద్దపులుల సంచారం రైతులను, మహిళ కూలీలను భయభ్రాంతులకు గురి చేస్తుంది. గత ఏడాది కాగజ్‌నగర్‌లో జరిగిన పులి దాడిలో మహిళా కూలీ మృతిచెందిన ఘటన పత్తి కూలీలను భయాందోళనలకు గురి చేస్తుంది. అటవీ శివారు ప్రాంతాల్లోని పత్తి చేన్లలోకి మహిళ కూలీలు ఎవరు వెళ్లడం లేదు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. అలాగే అటవీ శాఖ అధికారులు అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.



మంచిర్యాల జిల్లా అడవుల్లో తిరుగుతున్న పెద్దపులి (ఫైల్)

మహారాష్ట్ర నుంచి వలసలు

మహారాష్ట్రలోని తాడోబా అభయారణ్యంలో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. పులులు ఎప్పుడు ఒకే ఆవాసాన్ని కలిసి పంచుకోలేవు. కాబట్టి మహారాష్ట్ర నుంచి కొమురంభీంఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించి పెన్‌గంగా పరివాహక ప్రాంతం మీదుగా మంచిర్యాల జిల్లాలోకి భారీగా పులులు వలసలు వస్తున్నాయి. అలాగే మహారాష్ట్రలోని తిప్టేశ్వర్ అభయారణ్యంలో నుంచి బేల, ఆదిలాబాద్ మీదుగా పెద్దపులి జన్నారం, కవ్వాల అభయారణ్యంలోకి వచ్చి ఇందన్‌పల్లి వద్ద స్థిరపడింది. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు పులులు జత కోసం వెతుకుతూ ఉంటాయి. అందులో భాగంగా జిల్లాకు వలస వస్తుంటాయి. అతిథిలుగా వచ్చిన పులులు తిరిగి వెళ్లకుండా ఉండేందుకు అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. మంచిర్యాల అడవుల్లో పచ్చ గడ్డి, శాఖాహార జంతువులతో పాటు అటవీ ప్రాంతాల్లో నీటి కుంటలను నిర్మించడంతో పులుల ఆవాసాలకు అనుకూలంగా మారుతున్నాయి. ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకుంటే పులుల సంతతి ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పులులకు హాని తలపెట్టవద్దు

శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీ శాఖ అధికారి, మంచిర్యాల



అడవిలో స్వేచ్ఛగా తిరిగే పులులకు ఎటువంటి హానీ తలపెట్టవద్దు, కరెంటు వైర్లు, ఉచ్చులతో పులికి హానీ తలపెడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కఠిన చర్యలు ఉంటాయి. ఒక వేళ పులి దాడిలో పశువులు మృతిచెందితే యాజమానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిస్తాం. ఎవరు కూడా పులులకు హానీ తల పెట్టరాదు. పులులు కనిపిస్తే సమీప అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. వ్యవసాయ కూలీలు, రైతులు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లరాదు. పులుల సంరక్షణకు అందరు సహక రించాలి.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

తాండూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా బరిలో ఉన్న అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్ సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థులతో ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్రచారాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్, తహసీల్దార్ జ్యోత్స్న, సీఐ దేవయ్య, ఎస్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలి

జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరు బీజేపీ సర్పంచు అభ్యర్థులను గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం చెన్నూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కిష్టంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో సంకారం గ్రామంలో అటవీ ప్రాంతంలో ఇద్దరు పిల్లలు రహదారి మరిచి మరణించిన సంఘటనకు ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి చెన్నూరు నుంచి బుద్దారం వరకుప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద తారు రోడ్డు నిర్మాణం జరిపించారన్నారు. గామాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు దుర్గం అశోక్, రత్న లక్ష్మీనారాయణరెడ్డి, రాజశేఖర్, మంత్రి రామయ్య, శివకృష్ణ, రాజక్క, రాజారాం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమించరాదు



మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అతిక్రమించరాదని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల నియమావళిపై సర్పంచు అభ్యర్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ప్రశాంతంగా ప్రచారం చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలుంటాయన్నారు. వ్యక్తిగత దూషణలు సోషల్ మీడియాలో చేయరాదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరు సహకరించాలన్నారు. తహసీల్దార్ సునీల్‌కుమార్‌దేశ్‌పాండే, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎస్ఐలు ఆంజనేయులు, గంగారాం పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం...

(5వ పేజీ తరువాయి)

మహిళలే బరిలో దిగుతు న్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీచేసి, గెలిచిన మహిళల సంఖ్య అధికంగానే ఉంది. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో కూడా మహిళా ఓటర్లను ఆకర్షించేం దుకు జనరల్ స్థానాల్లో కూడా కొందరు మహిళలను రంగంలోకి దింపు తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లే అభ్యర్థుల గెలుపోట ములను నిర్ణయి స్తున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు గ్రామాల్లో ఎక్కువగా మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వం కూడా మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం ఉపాధి కోసం యూనిట్లు మంజూరు చేస్తూ రుణాలు అందజేస్తోంది. ఆర్టీసీ అద్దె బస్సుల్లో మహిళలను పాత్రదారులను చేయడం, పెట్రోల్ బంకుల ఏర్పాటు, తదితర పథకాలు ప్రత్యేకంగా రూపొందిస్తోంది. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం, ఇంది రమ్మ ఇళ్లు మహిళల పేరిట ఇవ్వడం ద్వారా వారికి పెద్దపీట వేస్తోంది. అధికార పార్టీతోపాటు ప్రతి పక్ష పార్టీల నాయకులు సైతం మహిళల ఓట్లపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 శాతం మించి రిజర్వేషన్లు కల్పించరాదనే సు ప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆ తీర్పుకు లోబడి రాష్ట్ర ప్రభు త్వం కేటగరీల వారీగా రిజర్వేషన్లు ప్రకటించింది. అయి నప్పటికీ రిజర్వేషన్లకు అతీతంగా అన్‌రిజర్వ్‌డ్ స్థానా ల్లోనూ మహిళలే రంగంలోకి దిగుతుండటం గమనార్హం.



ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..

భైరవ కొండ

- స్వయంభూగా వెలిసిన కాలభైరవుడు
- ఈ నెల 12న భైరవ జయంతి

కోటపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం, కొండలు గుట్టల కింద నీటి ధారలు. పక్కనే గోదారమ్మ గల గలలు. పచ్చని పొలాలు, పక్షుల కిలకిలలు వెరసి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతోంది భైరవ కొండ. కొండపై తపస్సు చేసుకుంటున్న ఋషులు, మునీశ్వరుల యాగ శాలలను గోదావరి తన ప్రవాహంతో ముంచెత్తుతుండడంతో శివాజ్ఞతో నది ప్రవహానికి అడ్డుగా నిలిచి నది దిశను భైరవుడు మార్చాడని స్థల పురాణం చెబుతుంది. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా విలసిల్లుతున్నాడు కాలభైరవుడు.

కోటపల్లి మండలంలోని పారుపెల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండపై కాలభైరవుడు స్వయంభుగా వెలిశాడు. నాసిక్ సమీపంలోని త్రయంబకేశ్వరం వద్ద జన్మించిన గోదావరి ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్వేది వద్ద సముద్రంలో కలిసే వరకు తూర్పు వైపుకే ప్రవహిస్తున్నది. కానీ చెన్నూరు మండలంలోని పొక్కూరు వద్ద నుంచి పారుపెల్లి భైరవ కొంమూల మలుపు వరకు గోదావరి నది ఉత్తర దిక్కులో ప్రవహిస్తుంది. ఉత్తర దిక్కుగా ప్రవహిం చడం వల్ల ఈ ప్రాంతంలో గోదావరి నది పంచ క్రోశ ఉత్తర వాహినిగా పిలుస్తారు.

గోదావరి దిశను మార్చిన భైరవుడు

ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న గోదావరి నది ప్రవాహాన్ని తూర్పు దిశ వైపు భైరవుడు మళ్లించాడని స్థల పురాణం చెబుతుంది. ఉత్తరంగా ప్రవ హిస్తే పారుపెల్లి గుట్టలపైను యజ్ఞయాగా దులు చేస్తున్న మునీశ్వరులకు , ఋషులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో శివుని ఆజ్ఞ మేరకు భైరవుడు దిగంబరునిగా నది ప్రవాహానికి అడ్డుగా నిలిచాడని దీంతో గోదావరమ్మ తన ప్రవా హదిశను తూర్పు వైపు మళ్లించిందని చెబుతారు.

శివాంశ సంభూతుడు

భైరవుడు శివాంశ సంభూతుడు అని పంచ భూతాలు, సూర్యచంద్రాదిగ్రహాలు భైరవుని అదుపు ఆజ్ఞలలో ఉంటాయని పండితులు అంటారు. కాలాన్ని శాసించినందున కాల భైరవుడు అనే పేరు వచ్చిందని శివ పురాణం చెబుతుంది. భైరవుడు ఇక్కడ కొలువై ఉండడంతో ఈ ప్రాంతాన్ని పవిత్రంగా భావిస్తారు. పారుపెల్లి గ్రామస్థులు అయితే తమ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మొదటి మొక్కు భైరవునికే చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది.

కోర్కెలు నెరవేరతాయని నమ్మకం..

పారుపెల్లి గుట్టల్లో వెలుస్తున్న భైరవునికి నిత్య పూజలు జరుగుతున్నాయి. అయితే మార్గశిర మాస బహుళ అష్టమి అయిన ఈ నెల 12న భైరవ జయంతిని వైభవంగా నిర్వహిస్తారు. చెన్నూరుతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలు , ఇతర పట్టణాల నుంచి భక్తులు తరలి వస్తారు. కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. అయితే ప్రభుత్వం ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటక ప్రాంతంగా గుర్తిస్తే మరింత ప్రయోజనం కలుగుతుందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.



వాహనాల తనిఖీ



భీమారంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భీమారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపధ్యంలో సోమవారం భీమారం మండల కేంద్రంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, పలు రకాల వస్తువులు తీసుకువెళ్లే అవకాశాలు ఉన్నందున తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమిని, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి ఫీడర్ విద్యుత్ ఉపకేంద్రాల పరి ధిలోని భీమిని, కన్నెపల్లి, నాయకుని పేట, లక్ష్మీపూర్ మండలంలోని గ్రామాల్లో సోమ వారం 33 కేవీలో మరమ్మతులు కారణంగా కొత్త విద్యుత్ లైన్లు మేయింటనెన్స్ పనుల కారణంగా డివిజనల్ ఇంజనీర్ ఏ. రాజేశం తెలిపారు. ఈ గ్రామాల్లోని ఉప కేంద్రాల పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంట నుంచి 4 వరకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం నాయకులు కమిషనర్ సంపత్‌కు వినతి పత్రం అందజేశారు. కార్పోరేషన్ పరిధిలో పని చేస్తున్న వాటర్ సప్లయి, ఎలక్ట్రిషియన్‌ల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ కొరకు డాటా అడగగా వారి పేర్లు పంపకపోవడంతో అప్రూవల్ కాలేదని, 350 మంది పని చేస్తున్న విషయం తెలవదా అని వారు ప్రశ్నిం చారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కేవలం 280 మంది పేర్లను మాత్రమే అప్రూవల్‌కు పంపడం సమంజసం కాదన్నారు. 76 మంది కార్మికుల పేర్ల డేటాలో అప్రూవల్ కాకపోవడంతో రోడ్డున పడే అవకాశం ఉందని, అధికా రులు స్పందించి అందరిపేర్లు నమోదు చేసి వారి సమస్యను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుదమల్ల హరికృష్ణ, ఎండి సోహైల్ ఖాన్, పూరేళ్ల హరీష్, సంపత్ కుమార్, రొడ్డ హరీష్, తదితరులు ఉన్నారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట బందోబస్తు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎంలు భద్రపరిచే గోదాము వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదామును సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గోదాము వద్ద 24 గంటలు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఏజెంట్ల పాత్రే కీలకం



- అమ్ముడుపోతే అభ్యర్థి పరిస్థితి అంతే సంగతి
- ఒక్క ఓటుతో కూడా ఓటమి చెందే అవకాశం

హాజీపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ బూత్ కౌంటింగ్ హాల్‌లో అభ్యర్థుల తరుపున పరిశీలన కోసం కూర్చునే ఏజెంట్ల పాత్ర చాలా కీలకం. బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చి న వారిని నిశితంగా పరిశీలించడం. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల్లో చాలా మటుకు కొత్త ఓటర్లు మారుతూ ఉంటారు. వారిని గుర్తించడం కష్టం. ఇలాంటి సందర్భాల్లో ఆయా వార్డుల్లో స్థానికంగా అందరికీ సుపరిచితమైన వ్యక్తిని ఏజెంట్‌గా నియమించుకోవాలి. అతను విశ్వాస పాత్రుడై ఉండాలి. ఎదుటి పార్టీకి అమ్ముడు పోతే ఇక అభ్యర్థి సంగతి అంతే. కౌంటింగ్ రోజు కూడా చురుకుగా వ్యవహరించే వ్యక్తులనే ఏజెంట్లుగా నియమిం చడం ఉత్తమం.

ఈ నెల 11,14,17 తేదీల్లో జరగనున్న పంచాయతీ పోరులో అభ్యర్థులు రాత్రి వరకు శ్రమించి ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో మునిగిపోతారు. అభ్యర్థులు పోలింగ్ కేంద్రం బయట ఓటర్లకు దండాలు పెడుతూ ఓట్లను అభ్యర్థిస్తారు. పోలింగ్ కేంద్రం లోపల ఏజెంట్లను నియమించుకుని ఓటరు అసలు ఓటరేనా లేదా అనేది ఏజెంట్లకు సమ్మతమైతేనే అధికారులు ఓటు వేసేందుకు వీలు కల్పిస్తారు. పోలింగ్ కేంద్రంలో ఉండే ఏజెంట్లు అభ్యర్థులకు విశ్వాస పాత్రులై ఉంటేనే వారికి న్యాయం జరుగుతుంది. ఒక వేళ వేరే పార్టీ వారికి అమ్ముడు పోతే అక్కడ బోగస్ ఓట్లు పడి అభ్యర్థుల తలరాత తారుమారయ్యే అవకాశం ఉంది. ఓటింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేసి, కౌంటింగ్ రూమ్‌కు తరలించేవరకు ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి. లెక్కింపు సమయంలో చురుకుగా ఉండే వ్యక్తులను ఏజెంట్లుగా నియమిం చుకోవాలి. బ్యాలెట్ పేపర్‌పై ఓటు ఎలా వేశారనేది పరిశీలించి ఏమైనా తేడాలుంటే అధికారుల దృష్టికి తీసుకు పోవాలి. గత ఎంపీటీసీ ఎన్నికల్లో హాజీ పూర్ మండలం పెద్దంపేట్‌లో బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల గుర్తులు తారుమారయ్యాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఏజెంట్లుగా జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఏజెంట్ల నియమ నిబంధనలు

- పోలింగ్ ఏజెంట్లు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలి. ఓటరుగా నమోదై ఉండి ఎన్నికల సంఘం ఫోటో గుర్తింపు కార్డు కలిగి ఉండాలి.
- ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రతి అభ్యర్థి తరుపున ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు.
- పోలింగ్ ఏజెంట్ ఫారం 10లో పోటీ చేస్తున్న అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ నియామక పత్రం పొందిన వారికి నిరూపణ డిక్లరేషన్‌పై ఏజెంట్ పాస్ జారీ చేస్తారు.
- ఒక్కో బూత్‌కు మూడు పాస్‌లు జారీ చేసినా, ఒక్కరు మాత్రమే కూర్చోవడానికి అనుమతి ఉంటుంది. పోలింగ్ ఏజెంట్‌లు ఒక గంట ముందు పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి. ఆలస్యంగా వెళ్లిన అధికారులు వారి ప్రక్రియ వారు చేసుకుపోతారు.
- ఆలస్యమైతే బ్యాలెట్ బాక్స్ సీల్‌లో ఏజెంట్ సంతకం చేయడం, పరిశీలన చేయలేకపోతారు. అలాగే పోలింగ్‌ముగిసిన తర్వాత, బ్యాలెట్ బాక్స్‌ల సీలింగ్ ప్రక్రియను పర్యవేక్షించి దానిపై సంతకం చేయాలి.
- పోలింగ్ ఏజెంట్ ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్, వైర్లెస్ కార్డులెస్‌లు తీసుకుపోకూడదు.
- పార్టీ కండువాలు, గుర్తులు ధరించరాదు. వేయని ఓటర్ల వివరాలను చీటిపై రాసి బయటకు పంపించకూడదు.
- పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక, తతంగాన్ని ఏజెంట్ నిశితంగా పరిశీలించి అనుమానాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారికి, పరిశీలకుల, సూక్ష్మ పరిశీలకులకు ఫిర్యాదు చేయాలి. పోలింగ్‌కు అభ్యంతరం తెలి యజేవయచ్చు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

వేమనపల్లి,డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లందరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌లు పేర్కొన్నారు. సోమవారం నీల్వాయి, వేమనపల్లి, గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లోని వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తూ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా అభ్యర్థులు డబ్బులు, మద్యం పంపిణీ చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

బాల్య మిత్రురాలికి బాసటగా..

దండేపల్లి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన చెరుకు పద్మ భర్త గంగాధర్‌కు ఇటీవల రోడ్డు ప్ర మాదంలో తీవ్రంగా గాయపడాడు. ఈ విషయం తెలుసుకున్న పద్మతో తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2007-08 టెన్త్ బ్యాచ్ బాల మిత్రులు వైద్య ఖర్చుల కోసం రూ 22 వేల 500 బాల్య మిత్రురాలు పద్మకు అందజేసి ఔదార్యం చాటుకున్నారు.






సైనికుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

బుజ్జగింపులు... బేరసారాలు..

- నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలో ఇప్పటికే నామినేషన్లు, అప్పీళ్ల ఘట్టం ముగియగా నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారంతో గడువు ముగియనుంది. దాంతో గ్రామాల్లో రెబల్స్‌గా వేసిన అభ్యర్థుల బుజ్జగింపు పర్వాలు ఊపందుకున్నాయి. మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా రహపల్లి, చిలాటిగూడలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు లేక పోవడంతో నామినేషన్లు దాఖలు కాలేదు. కాగా మిగిలిన 25 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే 236 వార్డు స్థానాలకు గాను ఐదు వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. 25 సర్పంచ్ స్థానాలకు 102 మంది, 231 వార్డు స్థానాలకు 584 మంది పోటీలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బలపరిచిన అభ్యర్థులు ఖరారు అయినప్పటికి పలు పంచాయతీల్లో అదే పార్టీ నుంచి రెబల్స్‌గా నామినేషన్లు వేశారు. దీంతో ఆయా గ్రామపంచాయతీల్లో ఆయా పార్టీల నాయకులు కలిసి రహస్య సమావేశాలు నిర్వహిస్తూ బుజ్జగింపులు చేస్తున్నారు. పార్టీ నుంచి ఒక్కరే బరిలో ఉండాలని మాట విని ఉపసంహరణ చేసుకున్న వారికి రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామంటూ హామీలు ఇస్తున్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థికి సహకరించాలని కోరుతూ రెబల్స్‌ను పోటీ నుంచి తప్పించేలా పార్టీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రంతో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియనుండగా ఏ గ్రామపంచాయతీలో ఎందరు బరిలో ఉంటున్నారు, ఏ గుర్తులు వచ్చాయి అనేది తేలనుంది.



నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే..

వాంకిడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఈసారి ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటాకు ఓటు వేయవచ్చు. మరి బరిలో నిలిచిన అభ్యర్థుల కన్నా ఎక్కువ ఓట్లు నోటాకు వచ్చినా ఎన్నిక రద్దయ్యే అవకాశం లేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధన ప్రకారం నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా రెండోస్థానంలో ఉన్న అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు అత్యధికంగా ఓట్లు వస్తే ఆ ఎన్నికల ఫలితాన్ని రద్దుచేసి మళ్లీ పోలింగ్ నిర్వహించాలని గతంలో సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయింది. 19 కన్నా తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను తదుపరి ఐదేళ్లపాటు అన్ని ఎన్నికల్లో పోటీ చేయకుండా చూసేలా నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించిన కోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అయినా ఇప్పటివరకు ఈ అంశాలపై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఖర్చు లెక్క ఇక పక్కా

సిర్పూర్(టి), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇక ఆన్‌లైన్ ద్వారా తమ బ్యాంకు వ్యక్తిగత ఖాతా నుంచి రోజువారీగా ఎన్నికల అభ్యర్థులకు ఆధికారులకు ఎన్నికల ఖర్చు వివరాలు నిర్వహణ రిజిస్టర్లు తప్పకుండా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసేవారు 1.50 లక్షల రూపాయలు, వార్డు స్థానాలకు 30 వేల రూపాయలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు. సిర్పూర్(టి) ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల పరిశీలకుల ద్వారా ఖర్చుల రిజిస్టర్లను ఆయా అభ్యర్థులు సోమవారం తీసుకున్నారు.

పోటీ నుంచి తప్పుకోకపోతే చంపేస్తాం..

- ట్రాన్స్‌జెండర్‌కు బెదిరింపులు
- కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న ట్రాన్స్‌జెండర్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోకపోతే చంపేస్తామంటూ ఓ ట్రాన్స్‌జెండర్‌కు ప్రత్యర్థి బెదిరించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూరు మండలం మార్లవాయి గ్రామపంచాయతీలో జరుగుతున్న మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్ సాధన(సంతోష్) నామినేషన్ వేశారు. నామినేషనను విత్‌డ్రా చేసుకోవాలని మొదటినుంచి ఒత్తిడి తెచ్చారు. అయినా సాధన భయపడకుండా నామినేషన్ విత్‌డ్రా చేసుకోలేదు. నామినేషన్‌ను పరిశీలించిన అధికారులు ఎన్నికల్లో గుర్తును కూడా కేటాయించారు. దీంతో ఎన్నికల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం కోసం అంటించిన పోస్టర్లను, బ్యానర్లను ప్రత్యర్థి చింపివేస్తున్నారని, ఎన్నికల ప్రచారం చేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నికల పోటీనుంచి తప్పుకోవాలని తనకు ప్రత్యర్థి నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. ఈ మేరకు కలెక్టర్‌తో పాటు ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేసినట్లు సాధన తెలిపారు.



గుర్తుంటేనే గెలుపు

- బ్యాలెట్‌పై కనిపించని అభ్యర్థుల పేర్లు, ఫొటోలు
- అభ్యర్థులకు తప్పని గుర్తుల గుబులు
- సర్పంచ్, వార్డు సభ్యుల బ్యాలెట్‌పై నోటా
- నమూనా బ్యాలెట్ పత్రాలతో ప్రచార జోరు

వాంకిడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంపై గుర్తులతో పాటు అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. కానీ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం అభ్యర్థుల పేర్లు, ఫొటోలు బ్యాలెట్ పత్రాలపై కనిపించవు. కేవలం గుర్తులు మాత్రమే ఉంటాయి. ఓటు వేయాలనుకున్న అభ్యర్థి గుర్తు ఏదనేది ఓటర్లు మరిచిపోతే అంతే సంగతి. ఒకరికి వేయాల్సిన ఓటు మరొకరికి పడుతుంది. ఫలితంగా అభ్యర్థుల జాతకాలు తలకిందులయ్యే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తు ఓటర్లకు గుర్తుండేలా ప్రచారం సాగిస్తున్నారు.

పల్లెల్లో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇప్పటికే తొలి విడత జరిలో నిలిచిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు కేటాయించిన గుర్తులతో ప్రచారం హోరెత్తిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల భవితవ్యం వారికి కేటటాయించిన గుర్తులపైనే ఆధారపడి ఉంది. తమకు కేటాయించిన గుర్తులను ప్రజల మనస్సులో ముద్రపడేలా ఎవరు ప్రచారం చేస్తారో వారికే విజయావకాశాలు అధికంగా ఉంటాయి. సులువుగా గుర్తుంచుకునే గుర్తులు వచ్చిన అభ్యర్థులకు ఇతర అభ్యర్థులకంటే విజయావకాశాలు ఎక్కువే. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఏవీ బ్యాలెట్ పత్రాలపై ఉండవు. ఒక్క గుర్తులు మాత్రమే ఉంటాయి. పార్టీలకు సంబంధం లేని స్వతంత్ర గుర్తులు మాత్రమే అభ్యర్థులకు కేటాయించారు. ఆయా పార్టీల మద్దతుతో ఈ ఎన్నికలు జరుగుతున్నా బరిలో ఉన్న అభ్యర్థులు మాత్రం పార్టీలకు సంబంధంలేని గుర్తులతోనే ఓటర్ల వద్దకు వెళ్లాల్సిందే. రాష్ట్రఎన్నికల సంఘం సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తుల చొప్పున కేటాయించింది. ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులనే రిటర్నింగ్ అధికారులు అభ్యర్థులకు కేటాయించారు.

● అభ్యర్థులకు గుర్తుల గుబులు...

గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తుల గుబులు పట్టుకుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. పలు గుర్తులు ఒకే పోలికతో ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు, వృద్దులు, ఆ గుర్తులను గుర్తుంచుకోవడం కష్టంగానే ఉంది. పంచాయతీ ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే. తమకు వచ్చిన గుర్తు లను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు అభ్యర్థులు కష్టాలు పడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులపైనే అభ్యర్థుల విజయావకాశాలు ఆధారపడి ఉండడంతో ప్రతీ ఒక్క ఓటరుకు తమ గుర్తు తెలిసేలా ప్రచారం చేస్తున్నారు.

● సోషల్ మీడియాలోనూ ముమ్మరం...

వ్యక్తిగత ప్రచారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రచారం చేస్తున్నారు. హంగూ ఆర్భాటం లేకుండా తమ గ్రామానికి చెందిన ఓటర్లందరికీ తమ గుర్తు చేరేలా వాట్సాప్ గ్రూపుల్లో స్టేటస్‌లు పోస్టు చేస్తూ ప్రచారం చేస్తున్నారు. తమకే ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఫోన్లు చేసి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. తమ గుర్తును ముద్రించిన కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మొదటి విడిత ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో ప్రచార హోరు వేగం పుంజుకుంది. ఓటర్ల మనస్సుల్లో గుర్తులు బలంగా నిలిచేలా అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

● ఒకే పోలికతో తికమక....

అభ్యర్థులకు తెలుగు అక్షర మాల ప్రకారం గుర్తులు కేటాయించారు. నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవాల అనంతరం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో తొలి విడలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు) లింగాపూర్ మండలాల్లో 114 గ్రామ పంచాయతీలు, 944 వార్డుస్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. షెడ్యూల్ విడుదలైన తరువాత వ్యక్తిగతంగా ప్రచారం చేసిన అభ్యర్థులు రిటర్నింగ్ అధికారులు కేటాయించిన గుర్తులతో ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థులు తమ గుర్తులను ఓటర్ల మనసులో గుర్తిండిపోయేలా ప్రచారం చేస్తేనే విజయావాకా శాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన తరువాత తాము ఓటు చేయాలనుకున్న అభ్యర్థి గుర్తు గుర్తుకు రాకపోతే ఎవరికో వేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతాయి. ఇదిలా ఉంటే ఒకే పోలికతో పలు గుర్తులు ఓటర్లను తికమక చేసే అవకాశాలు ఉన్నాయి. పలక, నల్లబోర్డు, మంచం ఒకేలాగా ఉండడంతో ఓటర్లు ఇబ్బంది పడే అవకాశం ఉంది.

ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికల విధులకు దివ్యాంగులుగా ఉన్న ఉపాధ్యాయులకు, గర్భిణులకు, చంటి పిల్లలు ఉన్న మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డీపీవో భిక్షపతిగౌడ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. పదవీ విరమణ ఆరు నెలల లోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులకు, అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయులకు కూడా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహాచారి, వరలక్ష్మి, సునీత తదితరులు ఉన్నారు.



డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

పంచాయతీ ఎన్నికల్లో స్టేజ్-2 ఆర్‌వోల పాత్ర కీలకం

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణలో స్టేజ్-2 ఆర్‌వోల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతితో కలిసి మొదటి, రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో భాగంగా స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. జిల్లాలో మూడు విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓట్లలెక్కింపు, ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహణ పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అధికారులు తమకు కేటాయించిన గ్రామపంచాయతీల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదటగా వార్డు సభ్యుల స్థానాలకు, అనంతరం సర్పంచ్ స్థానానికి ఓట్ల లెక్కింపు చేపట్టి ఉప సర్పంచ్‌ను ఎన్నుకోవాలని తెలిపారు. ఎన్నికల్లో ఉపయోగించే సామగ్రి కవర్లు, పోలింగ్ కేంద్రాల్లో కుర్చీలు, టేబుళ్లు, వెలుతురు సక్రమంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కౌంటింగ్ ముందు పీవో డైరీ, బ్యాలెట్ పేపర్, అకౌంట్ పేపర్ సీల్, జోనల్ అధికారులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో శాంతిభద్రతలపై పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఊశన్న, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

యువ సైనికుడికి అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని జైనూరు మండలం జంగామ్ గ్రామానికి చెందిన యువ సైనికుడిని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించారు. యువకుడు మరప జ్యోతిరామ్ అగ్నివీర్ పథకంలో ఎంపికై బెంగుళూరులో శిక్షణ పూర్తి చేసుకున్నాడు. చండీఘడ్‌లో పోస్టింగ్ వచ్చిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో ఎమ్మెల్యే సైనికుడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సేవ కోసం మారుమూల గ్రామ యువకుడు పాల్గొనడం అభినందనీమమన్నారు. కార్యక్రమంలో నాయకులు లాల్‌బాయ్, భగవంత్‌రావు, సందుల్ శవ్, బబ్రువాన్, విశ్వనాథ్, రమేష్, ఉదవ్‌సింగ్ పాల్గొన్నారు.

సావర్‌ఖేడ పాఠశాల సందర్శన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సావర్‌ఖేడ ఎంపీపీఎస్ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు త్వరలోనే కేంద్ర బృందం రానున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారిని పలు అంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబాట్టారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమాలు చాలా బాగా కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి తొలి విడత జరిగే సర్పంచ్ ఎన్నికల కోసం తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ జరిగే అన్ని రూట్స్‌కి రవాణా సౌకర్యం ఉందా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో సురేష్, ఎంపీవో సాయిరాం, ఎంఈవో ప్రకాష్, ప్రధానోపాధ్యాయుడు రంగయ్య ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంతో పాటు పెద్దసిద్దాపూర్, బారెగూడ, ముంజంపల్లి తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. అన్నికేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట కార్యదర్శి తుకారాం తదితరులు ఉన్నారు.

ఈఎస్ఐ భవన నిర్మాణానికి కృషి: ఎమ్మెల్యే



ఈఎస్ఐ సూపరింటెండెంట్‌తో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి నూతన భవనం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని శిథిలావస్థకు చేరిన ఈఎస్ఐ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జగన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒకప్పుడు పట్టణంలో వేలాది మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించిన ఈఎస్ఐ ఆసుపత్రి ప్రస్తుతం వెలవెలబోతోందని, భవనం సైతం శిథిలావస్థకు చేరిందన్నారు. నూతన భవన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈఎస్ఐ నూతన భవన నిర్మాణానికి కసరత్తు జరుగుతోందన్నారు. ఆసుపత్రి ఇతర భవనంలోకి తరలించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి వేసి 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. డయాగ్నోస్టిక్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

సామాజిక స్పృహ కలిగిన అభ్యర్థులను గెలిపించండి

దహెగాం: సామాజిక స్పృహ, బాధ్యత కలిగిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు సూచించారు. దహెగాం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమని, అలాగే జాతీయ ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించేది కూడా కేంద్ర ప్రభుత్వమే నని అన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద బీటీ రోడ్లు వేయనున్నామని తెలిపారు. పీపీ రావు కాలనీ నుంచి సుర్దాపూర్ వరకు హత్తిని మీదుగా హమ్ పథకం ద్వారా రోడ్డు మంజూరు అయిందని త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. నాయకులు శంకర్, తిరుపతి, దామోదర్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, వినోద్, శ్రీకాంత్, హరీష్‌గౌడ్, అరవిందగౌడ్, వెంకటేష్, సత్యం, ప్రదీప్, విజయ్, రాజు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని అచ్చెల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నిధులతో అభివృద్ధికి పాటు పడుతామని అన్నారు. ఆరెగూడలో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు త్వరలోనే చేపడాతమని తెలిపారు. అంతకుముందు గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విగ్రహం వద్ద రంగులు, పూలతో అలంకరించాలన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, కలెక్టరేట్ పీవో కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి నాసా ప్రాజెక్టు కిట్ అందజేత

కాగజ్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు నాసా ప్రాజెక్టుకు సిద్ధం చేసిన కిట్‌ను డీఎస్పీ వాహిదుద్దీన్‌కు అందజేశారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కిట్‌లను అందజేయడంతో విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, ఏజీఎం అరవింద్‌రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు, డీన్ శ్రీనివాస్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- ఎస్పీ నితికా పంత్ - పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఆసిఫాబాద్ పట్టణంలో ఎస్పీ నితికా పంత్ ఆధ్వ ర్యంలో పోలీసులు సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలందరు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని, ఎవరైనా గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడడం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించడం లాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రజలు ఎన్నికల నియమాలను పాటించాలని, డబ్బులు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు.

● ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాలాజీ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులు ముందుంటారన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ

పెంచికలపేట: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎస్సై అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చిన్ను ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాహనాల తనిఖీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, మత్తు పదార్థాలు, బెట్టింగ్ కార్యకలాపాలు వంటి నేరాలను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





ఆసిఫాబాద్ పట్టణం, బాబాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ నితికా పంత్, పోలీసులు